

దేశానికి వెన్నెముక రైతన్న. అటువంటి అన్నదాతలపై వరదలు, భారీ వర్షాలు పగబట్టినట్లు పచ్చని పంట పొలాలను నీటిలో ముంచి సర్వనాశనం చేశాయి. ఇప్పటికే పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టిన రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చింది. ఆగమేఘాలపై పంట నష్టపరిహారం అంచనాలు వేయించింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అతి తక్కువ కాలంలో ఎక్కువ పరిహారం రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసింది. ఇది అన్నదాతల ప్రభుత్వమని నిరూపించింది.

37,765 మంది రైతులకు రూ.56.70 కోట్ల పరిహారం జమ

రూ.26,460 పడ్డాయి



నాకు బొబ్బర్లంకలో 1.89 ఎకరాల భూమి ఉంది. ఎకరం భూమిలో పసుపు, మిగిలిన భూమిలో కంద పంట సాగు చేశా. పంట నష్టపరిహారంగా రూ.26,460 బ్యాంకు ఖాతాలో జమ అయింది. గతంలో పంట నష్టపరిహారం పొందాలంటే నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో రెండు వారాల్లోపే రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహారం జమచేశారు. నీట మునిగిన ఇంటికి కూడా రూ.10 వేల సాయం అందింది.

-కోనేరు వేణుగోపాల్, రైతు, బొబ్బర్లంక, మోపిదేవి మండలం

- పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ సాయం
- జిల్లాలో 22,876 హెక్టార్లలో వరి, ఇతర పంటలకు పరిహారం
- 3,779 హెక్టార్ల ఉద్యాన పంటలకు మరో రూ.10.42 కోట్లు విడుదల
- వరి పంటకు హెక్టారుకు రూ.25వేలు చొప్పున పరిహారం
- గత ప్రభుత్వంలో హెక్టారుకు పరిహారం రూ.17వేలే

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణానది, బుడమేరు వరదలు, భారీ వర్షాల కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో అతి తక్కువ వ్యవధిలోనే పంటల నష్టపరిహారం రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. ఆగస్టు నెల 29, 30, 31 తేదీల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా కృష్ణానదికి 11.42 లక్షల క్యూసెక్కుల మేర భారీ వరద వచ్చింది. మునుపెన్నడూ లేని విధంగా వరద రావడంతో లంక భూముల్లోని పంటలు నీటిలోనే రోజుల తరబడి ఉండిపోయి చనిపోయాయి. బుడమేరుకు వచ్చిన వరదల కారణంగా జిల్లాలోని గన్నవరం, ఉంగుటూరు, నందివాడ, గుడివాడ తదితర మండలాల్లోని రైతులు సాగు చేసిన వరిపైరు చనిపోయింది. రైతులను త్వరితగతిన ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెవెన్యూ గ్రామాల్లోని వ్యవసాయశాఖ అసిస్టెంట్లతో పంట నష్టం అంచనాలను తయారు చేయించింది. ఈ నివేదికలను వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో బుధవారం నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో పంట నష్టరిహారం నగదును జమ చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో పెద్ద ఎత్తున పంటలకు నష్టం

భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో 22,876 హెక్టార్లలో వరి, చెరకు, ఇతర పంటలకు నష్టం వాటిల్లినట్లుగా వ్యవసాయశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. జిల్లాలోని 25 మండలాల్లో 37,765 మంది రైతులు పంటలు కోల్పోయినట్లుగా నిర్ధారించారు. పంట నష్ట పరిహారంగా రైతుల ఖాతాల్లో రూ.56.70 కోట్ల నగదును జమ చేస్తున్నారు. గతంలో వరి, మొక్కజొన్న, చెరకు, పత్తి, వేరుశెనగ పంటలకు హెక్టారుకు రూ.17వేలను పంట నష్టపరిహారంగా ఇచ్చేవారు. రైతులు ఈ ఏడాది పంటలను పూర్తిగా నష్టపోవడంతో కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని హెక్టారుకు రూ.25వేలకు పెంచింది. దీంతో రైతులకు ఎకరానికి పదివేల చొప్పున అదనంగా జమవుతోంది.

నేలమట్టమైన ఉద్యాన పంటలు

జిల్లాలోని పెనమలూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లోని నదీతీర ప్రాంతాలు, లంక భూముల్లో 3,779 హెక్టార్లలో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. 6,501 మంది రైతులకు రూ.10.42 కోట్ల పంట నష్ట పరిహారంగా ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ నివేదికలను ప్రభుత్వానికి పంపటంతో బుధవారం రాత్రి నుంచీ రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతోంది. పసుపు, కంద, అరటి, కూరగాయలు, పూల తోటలు వారం రోజులపాటు నీటిలోనే ఉండి పూర్తిగా చనిపోయాయి. గతంలో మిరప, పసుపు పంటలకు హెక్టారుకు రూ.15వేలు పంట నష్టపరిహారంగా ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ నష్ట పరిహారాన్ని రూ.35వేలకు పెంచారు. అరటి తోటలకు గతంలో రూ.25 వేలు ఇవ్వగా, ప్రస్తుతం రూ.35వేలకు పెంచారు. మొక్కజొన్నకు గతంలో రూ.12,500 ఉండగా, రూ.15వేలకు పెరిగింది.





విజయవాడ ఇంద్రకీలాద్రిపై దేవీశరన్నవరాత్రుల ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అక్టోబరు 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో క్యూలైన్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. -ఆంధ్రజ్యోతి, విజయవాడ

మరో రెండేళ్లు అవకాశమివ్వండి

- కాదంటే చంద్రబాబు మాటే ఫైనల్
- విజయ డెయిరీ చైర్మన్, డైరెక్టర్ల మాట
- చైర్మన్ మార్పుపై ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యేల భేటీ

'విజయ డెయిరీ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులుకు రెండేళ్ల సమయముంది. ఇప్పుడు అర్ధంతరంగా ఆయన్ను రాజీనామా చేయమనడం సమంజసం కాదు. ఆయన గడువు పూర్తయ్యే వరకు అవకాశం ఇవ్వండి. ఆ తర్వాత పార్టీ నిర్ణయించిన వ్యక్తికే మేము మద్దతు తెలిపి చైర్మన్‌గా ఎన్నుకుంటాం. అలా కాదంటారా పార్టీ అధినేతగా చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటాం.' అని విజయ డెయిరీ డైరెక్టర్లు స్పష్టం చేశారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ చైర్మన్‌ను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ అధిష్ఠానం ఆదేశించిందని ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ.. చైర్మన్, డైరెక్టర్లకు తెలియజేశారు. నగరంలోని ఓ హోటల్‌లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల టీడీపీ నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి కొల్లు రవీంద్ర, రెండు జిల్లాలకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, మచిలీపట్నం పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ పాల్గొన్నారు. విజయ డెయిరీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లందరూ సమావేశానికి హాజరయ్యారు. తన రాజీనామా గురించి చైర్మన్ ఆంజనేయులు స్పందిస్తూ.. తన వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వాలన్నారు. ఇందుకు నాయకులు ససేమిరా అన్నారు. ముందు రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేయడంతో చైర్మన్ మౌనంగా ఉండిపోయారు. డైరెక్టర్లు మాత్రం చైర్మన్ పదవీకాలం మరో రెండేళ్లు ఉందని, ఇప్పుడే రాజీనామా చేయిస్తే అది పార్టీకే చెడ్డపేరు తెస్తుందని, ఎలాంటి ఆరోపణలు లేని చైర్మన్‌ను తొలగించడం సరికాదన్నారు. మిల్క్ యూనియన్ అభివృద్ధిలో ఆంజనేయులు ముద్ర ఉందని, ఒక ఫ్యాక్టరీని రెండు ఫ్యాక్టరీలుగా చేశారని, టర్నోవర్‌ను రూ.800 కోట్ల నుంచి రూ.1,200 కోట్లకు తీసుకొచ్చిన ఘనత ఆయనేదనన్నారు. ప్రస్తుతం వీరవల్లి ఫ్యాక్టరీ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం జరుగుతోందని, ఆ ఆలయం పూర్తయ్యే వరకైనా చైర్మన్‌ను కొనసాగించాలని వారు కోరారు. చైర్మన్, డైరెక్టర్ల అభిప్రాయాలను అధిష్ఠానానికి తెలియజేస్తామని ఎంపీ, మంత్రి స్పష్టం చేశారు.





కొత్తూరు తాడేపల్లి చెరువు కట్టపై పడేసిన నిత్యావసర కిట్లు

ఎందు 'కిట్లు'?

- కొత్తూరు తాడేపల్లి చెరువు కట్టపై నిత్యావసర కిట్లు
- వరద బాధితులకు అందాల్సిన కిట్లు అస్తవ్యస్తంగా..
- ఉపయోగపడే వస్తువులను సైతం పడేశారు
- పాలప్యాకెట్లను తగలబెట్టారు
- సివిల్ సప్లయిస్‌కు స్థానికుల సమాచారం
- విచారణ చేపట్టిన అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద బాధితులకు అందాల్సిన నిత్యావసరాల కిట్లు విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి చెరువు వద్ద కనిపించి కలకలం సృష్టించాయి. కొన్ని కిట్లు రోడ్డుపై పడేయడం, కొన్నింటిని కాల్చేయడాన్ని స్థానికులు సివిల్ సప్లయిస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గురువారం అధికారులు విచారణకు ఆదేశించారు. ఘటనాస్థలిని పరిశీలించి రావాలని పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు అధికారులను ఆదేశించారు. సివిల్ సప్లయిస్ అధికారుల నేతృత్వంలో జిల్లాలో నిత్యావసర కిట్లను నూరుశాతం పంపిణీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపే ప్రతి ఇంటికీ అందజేశారు. వరద బాధితులకు ఉపయోగపడే ఈ కిట్లను ఇలా కొత్తూరు తాడేపల్లి చెరువు కట్టపై ఎందుకు పడేశారో అర్థంకాని ప్రశ్నగా మారింది. నిత్యావసరాల కిట్ల పంపిణీ సివిల్ సప్లయిస్ సిబ్బంది, వీఆర్వోల పర్యవేక్షణలో జరగాలి. అధికారులు కాకుండా ప్రైవేటుగా కిట్లను ఎవరైనా తీసుకుని, పంచకుండా ఉద్దేశపూర్వకంగా దాచి ఉంచారా, చివరికి పాడైపోవడంతో అలా పడేశారా అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇక్కడ పడేసిన వాటిలో బంగాళదుంపలు, ఉల్లిపాయలు, పంచదార, కందిపప్పు, పాల ప్యాకెట్లు కూడా ఉన్నాయి. కొన్ని ప్యాకెట్లను తగలబెట్టారు. బంగాళదుంపలు, ఉల్లిపాయలు పాడైపోతాయి కాబట్టి పడేసినా, టెట్రా ప్యాక్ మిల్క్, పంచదార, కందిపప్పు వంటివి పారేయాల్సిన అవసరం లేదు. ఇవి కొంతకాలం నిల్వ ఉంటాయి. ఉపయోగపడే టెట్రా పాలప్యాకెట్లను కూడా తగలబెట్టడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరో ఉద్దేశపూర్వకంగానే చేసి ఉంటారని తెలుస్తోంది. ఈ ఘటనపై సివిల్ సప్లయిస్ అధికారులు రంగంలోకి దిగి, విచారణ ప్రారంభించారు.

గుడివాడ మున్సిపాలిటీలో ఫైళ్లు మాయం

అభివృద్ధి పనులపై జరుగుతున్న ఆడిట్

- బయటపెట్టని మున్సిపల్ అధికారులు
- రూ.వందల కోట్లకు ఆడిట్ అభ్యంతరాలు
- ఆ ఫైళ్లు కాల్చేశారా..? దాచేశారా...?
- ఆడిట్ అవ్వక, గ్రాంట్లు రాక కుంటుపడిన అభివృద్ధి
- గత వైసీపీ పాలనలో యథేచ్ఛగా అవినీతి, అక్రమాలు

గుడివాడ మున్సిపాల్టీలో అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మొన్న మ్యుటేషన్ పేరుతో, నిన్న జనరేటర్‌కు డీజిల్ పేరుతో కోట్లాది రూపాయలు బొక్కేశారు. ఇవాళ కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనుల ఫైళ్లు మాయం చేసేశారు. వైసీపీ నాయకులు, వారితో అంటకాగిన అధికారులు తాము చేసిన అడ్డగోలు వ్యవహారాలు ఎక్కడ బయట పడతాయోనని ఆడిట్ అధికారుల ముందుకు ముఖ్యమైన ఫైళ్లు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో వందల కోట్ల రూపాయల ఫైళ్లు ఆడిట్ అభ్యంతరాలతో అక్కడే ఆగిపోతున్నాయి. ఫలితంగా ఆడిట్ పూర్తికాక, కొత్త నిధులు రాక అభివృద్ధి కుంటు పడుతోంది.

గుడివాడ : సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకు లోకల్ ఫండ్ ఆడిట్ నిర్వహిస్తారు. ఆడిటర్లు అడిగిన ఫైళ్లను అకౌంట్స్ అధికారి ద్వారా సంబంధిత శాఖ అధికారి ఫైళ్లను ఎదుట పెట్టాలి. పూర్తిగా ఆడిట్ అయితేనే మున్సిపాల్టీకి రాయితీలు, గ్రాంటులు, ప్రపంచ బ్యాంకు రుణాలు వస్తాయి. గత ఐదేళ్లలో పురపాలక సంఘంలో వేలాది ఆడిట్ అభ్యంతరాలుండగా వందలాది ఫైళ్లు కనిపించడంలేదని సమాచారం. వీటి విలువ వందల కోట్లు ఉంటుందని ఆడిట్ అభ్యంతరాల్లో పేర్కొన్నారు. అవి క్లియర్ కాకపోవడంతో అనుకున్న స్థాయిలో గ్రాంటులు మున్సిపాల్టీకి రావడం లేదు. ఐదేళ్లుగా ఆడిట్ సంస్థ అభ్యంతరాలను లేవనెత్తుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం ఒక్క అభ్యంతరాన్ని కూడా క్లియర్ చేసుకున్న దాఖలాలు లేవు.

రెండేళ్ల వ్యవధిలో రూ.25 కోట్ల ఫైళ్లు గల్లంతు

2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.15 కోట్లు నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి 90 ఫైళ్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.10 కోట్ల నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి 85 ఫైళ్లను ఆడిట్ విభాగం ఎదుట పెట్టకుండా అధికారులు తప్పించుకు తిరుగుతున్నారు.



'అమృత్' తాలూక రూ.10కోట్ల ఫైలు అంతే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన అమృత్ పథకం తాలూకు కొన్ని ఫైళ్లు కనిపించడం లేదు. మొదటి ఫేజ్‌లో వందల కోట్ల పనులు జరిగాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అమృత్ నిధులు రూ.10 కోట్లతో చేపట్టిన పనికి సంబంధించిన ఫైలు ఒకటి అదృశ్యమైంది. జరిగిన పనులకు, కాంట్రాక్టర్లకు చేసిన చెల్లింపుల్లో వ్యత్యాసం ఉండటం, ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియ లేకుండా సొంత వారితో పనులు చేపట్టడం వల్ల జరిగిన అవకతవకలు ఎక్కడ బయటపడతాయోనని ఫైళ్లను చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆడిట్ అధికారుల ఎదుట సదరు ఫైళ్లను పెట్టకుండా మున్సిపల్ అధికారి ఒకరు చక్రం తిప్పినట్టు సమాచారం. వీటిని కూడా కార్యాలయం నుంచి మాయం చేసినట్టు ఆరోపణలున్నాయి.

మూడు శాఖల బాగోతం బట్టబయలు

మున్సిపాల్టీ పరిధిలో ముఖ్యంగా రెవెన్యూ ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలు భారీగా ఆర్థిక సంబంధిత లావాదేవీలు జరుగుతాయి. గత ఐదేళ్లలో వేలల్లో ఫైళ్ళు కింద స్థాయి నుంచి మున్సిపల్ కమిషనర్ వరకు ఆమోదం తెలిపి బిల్లుల చెల్లింపులయ్యాయి. వీటిలో అధిక భాగం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై మున్సిపల్ అధికారులు కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని వినికిడి.

కొత్త కమిషనర్ రాకపై ఆందోళన

ఈ నేపథ్యంలో బదిలీల్లో భాగంగా మున్సిపల్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గుడివాడ వస్తుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బదిలీపై వస్తున్న అధికారికి శాఖాపరంగా పూర్తి అవగాహన ఉండటంతో ఏమి చేయాలో పాలుపోక అవినీతి అధికారులు తలపట్టుకుంటున్నారు. కొత్త కమిషనర్ అయిన ఐదేళ్లలో అన్ని శాఖల్లో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.

ఎందుకంత భయం?

పనులు పారదర్శకంగా జరిగి ఉంటే ఫైళ్లను ఆడిట్ అధికారుల ఎదుట పెట్టడానికి మున్సిపల్ అధికారులు ఎందుకు వెనుకాడుతున్నారో బహిర్గతపరచాలి. మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుని ఆదేశాలతో వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కొందరు మున్సిపల్ అధికారులు సాగించిన దోపిడీ ఎక్కడ బయటకు వస్తుందోనని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆడిట్ అభ్యంతరాలు చూపిన ఫైళ్లు తప్ప అధికారులకు అవసరమై, చెల్లింపులు జరగాల్సిన ఫైళ్లు మాత్రం వెంటనే కనిపిస్తాయని అకౌంట్స్ విభాగ అధికారి ఒకరు బాహాటంగా చెబుతున్నారు.



వర్షం.. తీరని కష్టం!

6లో

పేర్ని ఇల్లు ముట్టడి

- పవన్‌కల్యాణ్‌కు పేర్ని నాని క్షమాపణలు చెప్పాలి
- పేర్ని నాని దిష్టిబొమ్మ దహనం
- రెచ్చిపోయిన వైసీపీ నాయకులు, పేర్ని కిట్టూ
- జనసేన నాయకుల అరెస్టు



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 26 : తప్పు చేసిన వారు ప్రాయశ్చిత్త దీక్ష చేస్తారంటూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని నాని అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల జన సైనికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్‌కు క్షమాపణలు చెప్పాలంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పేర్ని నాని ఇంటి ముందు బైఠాయించారు. పేర్ని నాని ఇంటి ముట్టడికి యత్నించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పేర్ని నాని డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పేర్ని నాని దిష్టిబొమ్మను దహనం చేశారు. మరోపక్క వైసీపీ నాయకులు, పేర్ని కిట్టు, కార్పొరేటర్ లంకా సూరిబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు తదితరులు పేర్ని నాని జిందాబాద్, పవన్‌కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డీఎస్పీ అబ్దుల్ సుబాన్, చిలకలపూడి, మచిలీపట్నం, ఆర్‌పేట ఎస్సైలు పోలీసు బలగాలతో పేర్ని నాని ఇంటికి తరలివచ్చారు. ఇరుపక్షాలతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పోలీసులతో ఇరుపక్షాల నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో పేర్ని కిట్టు, ఇతర నాయకులను ఇంట్లోకి పంపివేశారు. జనసేన నాయకులను అరెస్టు చేసి చిలకలపూడి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఎట్టకేలకు ఉద్రిక్తత సద్దుమణిగింది. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ, వైసీపీ నాయకులు అవినీతిలో కూరుకు పోయి అహంకారం వీడక ఇష్టారా జ్యంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. జనసేన నాయ కులు మాదివాడ రాము, కొట్టి వెంకట్రావు, గడ్డం రాజు, కర్రి మహేష్, పినిశెట్టి లక్ష్మి పాల్గొన్నారు.



కొండ పటిష్టత పనులను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

కొండ పటిష్టతకు చర్యలు

» ఘాట్‌రోడ్డులో పనులను పరిశీలించిన నిపుణుల బృందం

వన్‌టౌన్, సెప్టెంబరు 26 : దుర్గగుడి ఘాట్ రోడ్డు కొండ, దిగువన దుర్గాఘాట్ ఎదురుగా గల కొండ పటిష్టత పనులను గురువారం రాక్ మిటిగేషన్ నిపుణుడు కొండలరావు ఆధ్వర్యంలోని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సాంకేతికపరమైన అంశాలపై ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సంప్రదించారు. భవిష్యత్తులో రాళ్లు విరిగిపడకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక ఉండాలని ఆయన పేర్కొన్నారు. పనులను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కళావేదికపై కూచిపూడి నృత్యం

దుర్గగుడి కళావేదికపై గురువారం విజయవాడకు చెందిన కావ్యకౌస్తుభ కూచిపూడి నృత్యాలయం కోట సరిత ఆధ్వర్యంలో బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ఆహూతులను అలరించారు.



కాణిపాకం వినాయకస్వామికి దుర్గగుడి నుంచి పట్టువస్త్రాల సమర్పణ

కాణిపాక వినాయకుడికి పట్టువస్త్రాల సమర్పణ

వన్‌టౌన్ : కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానం నుంచి గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. వినాయక చవితి నుంచి 21రోజుల పాటు కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దుర్గగుడి ఏఈవో బి.వెంకటరెడ్డి, వైదిక కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, యజ్ఞనారాయణ, తదితరులు కాణిపాకం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కాణిపాకం ఆలయ ఈవో గురుప్రసాద్ తొలుత వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

సర్వదోష నివారణకు శాంతి హోమం..



రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఆలయాలలో సర్వదోష నివారణ శాంతి హోమాలు నిర్వహించారు. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈవో కేఎస్ రామారావు దంపతులు అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు విష్ణుభొట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు చండీయాగశాలలో శాంతి హోమాన్ని నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఆలయశుద్ధికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్న సంకల్పంతో సర్వదోష నివారణకు శాంతి పొందుటకు, హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

శ్రీకాకుళేశ్వర ఆలయంలో..



ఘంటసాల : తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో గత ప్రభుత్వ హయాంలో కల్తీ నెయ్యి వినియోగానికి నిరసనగా శ్రీకాకుళం శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు ఆలయంలో గురువారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన నేతలతో కలిసి ఆలయ ముఖద్వారం వద్ద వేదపండితుల మంత్రోచ్చరణ సంప్రోక్షణ జరిపించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మండలి మాట్లాడుతూ, తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించి హిందువుల మనోభావాలను గత పాలకులు దెబ్బతీశారని, వారుచేసిన తప్పిదాన్ని క్షమించని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.



టీడీపీనేత కొమ్మినేని నరసయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే సౌమ్య, మాజీ మంత్రి రఘురామ్

జనం మెచ్చిన నేత నరసయ్య

» కొమ్మినేని విగ్రహావిష్కరణలో నెట్టెం రఘురాం

కంచికచర్ల, సెప్టెంబరు 26 : నిత్యం అందుబాటులో ఉంటూ, సమస్యలను పరిష్కరించే నాయకులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ కొమ్మినేని నరసయ్య కాంస్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నరసయ్య లేకపోవటం టీడీపీకి తీరని లోటని ఘనంగా నివాళులర్పించారు. సేవా కార్యక్రమాల్లో ముందుండే నరసయ్య జనబలం కలిగిన నాయకుడని పేర్కొన్నారు. పలు పోరాటాలు చేసిన ఆయన పార్టీకి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. కుటుంబసభ్యులతో పాటుగా మండల టీడీపీ అధ్యక్షుడు కోగంటి బాబు, సర్పంచ్ షేక్ ఇబ్రహీం, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు మూరకొండ ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు వెంపరాల వెంకటేశ్వరరావు, పొన్నం రవి, ఆంజనేయులు, కోగంటి విష్ణు, గోగినేని అమర్‌నాథ్, తేళ్ల కోటేశ్వరరావు, మందా స్వామి, గంధం రామ్మూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆత్కూరు నరసయ్యగా ప్రసిద్ధి : దేవినేని ఉమా

ఇంటి పేరు కొమ్మినేని కంటే ఊరు పేరు ఆత్కూరు నరసయ్యగా పేరొందాడని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కొమ్మినేనికి ఘనంగా నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా, లేకపోయినా అందరినీ కలుపుకుని ఏకతాటిపై నడిపించిన వ్యక్తి నరసయ్య అన్నారు. గ్రామాన్ని టీడీపీకి కంచుకోట చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

నానీలు నోరు అదుపులో పెట్టుకోవాలి

» పేర్ని, కొడాలిపై మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 26 : కలుగులోంచి బయటకు వచ్చి పిచ్చి ప్రేలాపనలు పేలుతున్న మాజీ మంత్రులు పేర్ని, కొడాలి నానీలు కుళ్లు రాజకీయాలు చేస్తున్నారని, ప్రజలు మరోసారి కుళ్లబొడిచి రాజకీయంగా తరిమేస్తారని మంత్రి రవీంద్ర ధ్వజమెత్తారు. గురువారం మీడియాతో మంత్రి మాట్లాడుతూ, కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామి ప్రసాదం కల్తీ చేసిన వైసీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కృష్ణా జిల్లా నీటమునిగితే సేవలందించేందుకు వారు వచ్చారా అని ప్రశ్నించారు. వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు శక్తికిమించి పర్యటించి బాధితులకు సేవలందించారన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులను కూడా మళ్లించారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు గ్రామాల అభివృద్ధికి వంద రోజుల్లోనే కేంద్రం నుంచి రూ. 6వేల కోట్లు తీసుకు వచ్చారన్నారు. మచిలీపట్నంలో పేదలకు ఇళ్లస్థలాల పేరుతో వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కొల్లగొట్టేందుకు పేర్ని నాని ప్రయత్నం చేశారన్నారు. చెరువులను కబ్జా చేసిన వారిని వదిలేది లేదన్నారు. మడుగు పోరంబోకులో పేదలను మోసం చేసి రేకుల షెడ్లు, ఇళ్లు వేయించిన పేర్ని నాని వారి నష్టానికి బాధ్యులన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా తరహాలోనే ఇళ్లు తొలగించామన్నారు. నష్టపోయిన బాధితులకు పేర్ని నాని నష్టపరిహారం చెల్లించాలన్నారు. అర్హత గల పేదలకు స్థలాలు, ఇళ్లు ఇస్తామన్నారు. నానిని తరిమికొట్టే రోజులు వచ్చాయన్నారు. సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిఫలమే

కొనకళ్లకు ఆర్టీసీ చైర్మన్ పదవి : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : 2024 ఎన్నికల్లో ఎంపీ పదవిని త్యాగం చేసినందుకు టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు సీఎం చంద్రబాబు కానుకగా ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం కొనకళ్ల ఇంటికి కొల్లు రవీంద్రతో పాటు టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కుంచే నాని, లంకే నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, బీసీ నేతగా రాష్ట్రంలో పేరొందిన కొనకళ్ల రెండుసార్లు ఎంపీగా సేవలందించారన్నారు. ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఉన్న కొనకళ్లకు చైర్మన్ పదవి దక్కడం అభినందనీయమన్నారు.



కొనకళ్లను గజమాలతో అభినందిస్తున్న మంత్రి రవీంద్ర

దేవుడిని రాజకీయాల్లోకి లాగుతున్నారు

» 4న ఉచిత ఇసుక విధానంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

మచిలీపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి లడ్డూ పేరుతో దేవుణ్ని అన్ని పార్టీలు రాజకీయాల్లోకి లాగి రాద్ధాంతం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మచిలీపట్నంలో జరుగుతున్న సీపీఎం జిల్లా శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన అంశాన్ని రాజకీయాలకు ముడిపెట్టి అన్ని ప్రధాన రాజకీయపార్టీలు పోటీపడి తిరుపతి లడ్డూ అంశాన్ని రాజకీయాలు చేస్తూ దేవుడిని అభాసుపాలు చేస్తున్నాయన్నారు. తిరుపతి లడ్డూ తయారీలో అక్రమాలు జరిగాయనే ప్రచారం గత పది రోజులుగా జరుగుతోందన్నారు. తిరుపతి లడ్డూ తయారీలో అవకతవకలు జరిగితే ఏ కులం వారైనా, ఏ పార్టీవారైనా, ఏ మతం వారైనా, ఎంతటివారైనా తప్పకుండా శిక్షించాల్సిందేనన్నారు. దేవుడి పేరుతో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నించడం బాధాకరమన్నారు. తిరుపతి లడ్డూ అంశంపై ప్రభుత్వం ఇప్పటికే సిట్ విచారణను ఏర్పాటుచేసిందని, సిట్ విచారణ నిష్పక్షపాతంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై సిట్ విచారణ పూర్తయ్యేవరకు అన్ని పార్టీలు సంయమనం పాటించాలన్నారు. దేవుడి పేరుతో కులాలు, మతాలను అడ్డుపెట్టుకుని, తిరుపతి లడ్డూ అంశం ఆధారంగా చేసుకుని బీజేపీ, ఆర్ఎస్ఎస్ తనదైనశైలిలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాష్ట్రంలో బలపడటానికి చూస్తోందన్నారు. బీజేపీ వ్యూహానికి అనుగుణంగా తెలిసో, తెలియకో టీడీపీ, జనసేన, వైసీపీలు వంతపాడుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజంను బలపరిచేలా అన్ని పార్టీలు వ్యవహరించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులైనా ఇంతవరకు ఇసుక అందుబాటులోకి రాలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు కావడం లేదన్నారు. ఉచిత ఇసుక విధానం అని చెబుతున్నా, కొన్ని ప్రాంతాలలో గతంలో కంటే ఇసుక ధరలు పెరిగాయన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమరవాణా జరుగుతోందన్నారు. నేటికీ భవన నిర్మాణ కార్మికులు పనులు లేకుండా ఉంటున్నారన్నారు. ఈనెల 4వ తేదీన ఇసుక విధానంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజల జీవనం కష్టంగా మారిందని, ప్రజాసమస్యలపై కూటమి ప్రభుత్వ దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, సీపీఎం రాష్ట్ర కార్యద ర్శివర్గ సభ్యుడు వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు



గురునానక్ కాలనీలోని నివాసంలో పంచాయతీ ట్రాక్టర్, తోట పనిచేస్తున్న సిబ్బంది

ఈ సారు.. రూటే వేరు!

» పంచాయతీ సిబ్బందితో ఇంట్లో వెట్టి చాకిరీ

» రెండేళ్లుగా సూరంపల్లి కార్యదర్శి తంతు

» నెట్టింట్లో వీడియోలతో గుట్టు రట్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామంలో పనిచేయాల్సిన పంచాయతీ సిబ్బందితో తన స్వంత పనిచేయించుకుంటున్నాడో గ్రామ కార్యదర్శి.. బదిలీ అయినా తీరుమారని ఈ అధికారి గురువారం సిబ్బందిని తన ఇంటికి రప్పించుకుని వారి చేత గార్డెనింగ్ పనులు చేయించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కృష్ణా జిల్లా సూరంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కోట సురేశ్ బాబు చాలాకాలంగా విజయవాడ గురునానక్ కాలనీలోని తన నివాసంలో పంచాయతీ సిబ్బంది చేత తరచూ పనిచేయించుకుంటున్నాడన్న విమర్శలు ఉన్నాయి. గ్రామంలో పనిచేయించాల్సిన వర్కర్లను ఈ అధికారి తన సొంత పనులు చేయించుకోవటం పట్ల కార్మికుల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమౌతోంది. ఇటీవల సురేశ్ కృష్ణాజిల్లాలోనే ఉయ్యూరు వద్ద ఆకునూరు గ్రామానికి బదిలీ అయ్యారు. అయినా ఆయన పద్ధతి మారలేదు. సూరంపల్లి పంచాయతీ సిబ్బందిని పెద్ద సంఖ్యలో తెప్పించి తన ఇంటి వద్ద గార్డెనింగ్ పనులు చేయించారు. పంచాయతీ ట్రాక్టర్‌ను కూడా తెప్పించారు. దీనిని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయటంతో ఆయనగారి వ్యవహారం బహిర్గతమైంది.

కార్యకర్తల్ని ఇంటిపైకి పంపితే ఊరుకుంటామా!

» 50 మందిని పంపితే మేం 500 మందిని పంపుతాం

» మాజీ మంత్రి పేర్ని నాని



మచిలీపట్నం టౌన్ : ఉపముఖ్యమంత్రి పదవిలో ఉన్న పవన్ కళ్యాణ్ నా ఇంటిపైకి 50 మందిని పంపి రగడ చేయడం తగదని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో నాని మాట్లాడుతూ, నా ఇంటి ముందు బైఠాయింపులు జరిపి దిష్టిబొమ్మ దహనం చేసినంత మాత్రాన భయపడేది లేదన్నారు. పవన్ కళ్యాణ్ 50 మందిని పంపితే వైసీపీ కార్యకర్తలు 500 మంది వస్తారన్నారు. జనసేన నాయకులు ధర్నా చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారన్నారు.

పవన్ సైగచేస్తే 50 మంది కాదు.. వేలమంది వస్తారు : కొట్టె



పవన్‌కళ్యాణ్ సైగచేస్తే 50మంది కాదు.. వేలమంది వస్తారని మాజీ కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు అన్నారు. పవన్ పంపితే 50 మంది ఇంటి ముందుకు వచ్చారని పేర్ని నాని విమర్శించడం సరికాదన్నారు. జనసేన కార్యాలయం వద్ద కొట్టె మాట్లాడుతూ, నాని ఇష్టారాజ్యంగా పవన్‌పై విమర్శలు చేస్తే తాము శాంతియుతంగా ఇంటి ముందు ధర్నా చేశామన్నారు. వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బందరు పోర్టును తెచ్చిన ఘనత ఎంపీ బాలశౌరిదేనన్నారు. మచిలీపట్నం కార్పొరేషన్‌కు స్పెషల్ గ్రాంటు తీసుకురాలేని నానికి బందరు అభివృద్ధిపై మాట్లాడే హక్కు లేదన్నారు. నానికి భయపడేవారు ఎవరూ లేరన్నారు. మంత్రి పదవి కోసం జోగి రమేష్ చంద్రబాబు ఇంటిపైకి వెళ్లి అసభ్యంగా మాట్లాడలేదా అని ప్రశ్నించారు.

ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఆర్డీవోల బదిలీ

మచిలీపట్నం, విజయవాడ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు రెవెన్యూ డివిజన్ అధికారులను(ఆర్డీవో) బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఉయ్యూరు ఆర్డీవోగా బోడా సంపత్ హేలాషారోన్‌ను నియమించారు. ప్రస్తుతం ఉయ్యూరు ఆర్డీవోగా పనిచేస్తున్న డి రాజును నరసాపురం ఆర్డీవోగా బదిలీచేశారు. మచిలీపట్నం ఆర్డీవోగా కే స్వాతిని నియమించారు. ప్రస్తుతం మచిలీపట్న ఆర్డీవోగా పనిచేస్తున్న ఎం వాణిని నూజివీడు ఆర్డీవోగా బదిలీచేశారు. గుడివాడ మునిసిపల్ కమీషనర్‌గా పనిచేస్తున్న జి బాలసుబ్రహ్మణ్యంను గుడివాడ ఆర్డీవోగా నియమించారు. ప్రస్తుతం గుడివాడ ఆర్డీవోగా పనిచేస్తున్న పి పద్మావతిని జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీచేశారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్‌ల అధికారులను కూటమి ప్రభుత్వం మార్చివేసింది. అలాగే ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడ ఆర్డీవోగా భవానీశంకర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కావూరి చైతన్యను ఆర్డీవోగా నియమించారు. తిరువూరు ఆర్డీవోగా కడాల మాధురిని ఆర్డీవోగా నియమించారు. నందిగామ ఆర్డీవోగా కె. బాలకృష్ణను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న రవీంద్రరావును ప్రభుత్వం బదిలీ చేసింది.

వర్షం.. తీరని కష్టం!



పాలకాయితిప్ప వద్ద గుల్ల పంపుతో నీటిని బయటికి తోడుకుంటున్న రైతులు అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద నీటి ప్రవాహానికి అడ్డుగా ఇసుక మూటలు(ఇన్‌సెట్)

» నీట మునిగిన నారుమడులు

» నీటిని తోడేందుకు పాట్లు

కోడూరు : గత ప్రభుత్వం అవుట్ పాల్స్ నిర్మాణ విషయంలో కాలయాపన చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు. గత నాలుగేళ్లుగా కోడూరు మండల దిగువ ప్రాంతంలో 4 వేల ఎకరాలలో పంట వేసే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మా గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రైతులు స్వచ్ఛందంగా క్రాప్ హాలిడే ప్రకటించినప్పటికీ నష్టపరిహారం అందించిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. ముంపునకు తాత్కాలిక చర్యలు చేపడతామన్న ప్రస్తుత ఎమ్మెల్యే చొరవతో బీడు భూములు సాగు చేసేందుకు నారుమడులు సిద్ధం చేశామని, కానీ ఉప్పునీరు ఎగువకు రాకుండా పాలకాయితిప్ప, కోడూరు అవుట్ ఫాల్స్ స్లూయిస్ వద్ద, వేసిన ఇసుక మూటల కారణంగా అధికారుల పర్యవేక్షణ లోపంతో వర్షపు నీరు దిగువకు వెళ్లక పంట పొలాల్లోనే నిలిచి నారుమడులు నీటమునిగాయని తెలిపారు. ఇప్పటికైనా ముంపునకు ప్రధాన కారణమైన అవుట్ ఫాల్స్ స్లూయిస్ పునర్నిర్మాణం చేపట్టి రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని కోరుతున్నారు.

మండలంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి కోడూరు శివారు హంసల దీవి, పాలకాయితిప్ప, దింటిమెరక గ్రామాల సమీపంలో నారుమడులు నీటమునిగాయి. నీటిని బయటకు తీసి నారును రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ముంపుకి ప్రధాన కారణమైన అవుట్ పాల్స్ స్లూయిస్ నిర్మాణం చేసేది ఎప్పుడు అని రైతులు ప్రశ్నిస్తున్నారు.



» ఇసుక మూటల వల్లే..



అడుసుమిల్లి సాయిబాబు, రైతు

అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్ల వద్ద ఇసుక మూటలు వేయటం కారణంగానే వర్షపు నీరు సముద్రంలోకి వెళ్లక ఇప్పటికే రెండుసార్లు నారుమడులు పోశామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక చర్యలు మాని శాశ్వత చర్యలు చేపట్టాలి.

న్యూస్ బాక్స్



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న బొండాడ రాఘవేంద్రరావు

వరద బాధితులకు రూ. 25 లక్షల విరాళం

అవనిగడ్డ, సెప్టెంబరు 26 : కృష్ణా నది వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు బొండాడ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత బొండాడ రామేంద్రరావు రూ.25 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. నాగాయలంక మండలం పర్రచివర గ్రామానికి చెందిన రామేంద్రరావు దివి ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. రాష్ట్రంలో వరదల కారణంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు గురువారం రూ.25 లక్షల మొత్తాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు.



అవార్డును అందుకున్న రవీంద్ర భారతి చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతి

రవీంద్ర భారతికి డైనమిక్ స్కూల్ అవార్డు

ఆటోనగర్, సెప్టెంబరు 26 : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి సంపూర్ణ విద్యను అందించడంలో నిబద్ధతను ప్రదర్శించినందుకు రవీంద్ర భారతి గ్రీన్‌స్కూల్ ప్రతిష్ఠాత్మక డైనమిక్ స్కూల్ అవార్డు కైవసం చేసుకుందని పాఠశాల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ తెలిపారు. ఎడ్యుకేషన్ టుడే సంస్థ నుంచి అవార్డు అందుకున్నట్టు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరంతరం మారుతున్న ప్రపంచంలో డైనమిక్ లెర్నింగ్ వాతావరణాన్ని పెంపొందించే సంస్థల్లో గ్రీన్ స్కూల్ ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుందని ఎడ్యుకేషన్ టుడే కొనియాడిందన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శాంతిని అభినందించినట్టు తెలిపారు.

క్రైం కార్నర్



లారీని ఢీ కొని నుజ్జయిన కారు

ఉసురు తీసిన నిద్రమత్తు!

» ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

» ఇద్దరు మృతి.. ముగ్గురికి గాయాలు



మార్క్(ఫైల్)



మేరీ(ఫైల్)

గన్నవరం, సెప్టెంబరు 26 : అనారోగ్యంతో ఆపదలో ఉన్న ఆ కుటుంబంలో ప్రమాదం మరింత విషాదాన్ని నింపింది. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. వారిలో ఒకరికి ఆరోగ్యం బాగాలేకపోవటంతో ఐదుగురు కలిసి కారులో ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృత్యువు ఇద్దరిని కబళించింది. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కృష్ణా జిల్లా గన్నవరంలో గురువారం తెల్లవారు ఝామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన పల్లెపోగు ఆదాం భార్య ప్రేమమ్మ కేన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విశాఖలోని హోమీబాబా కేన్సర్ హాస్పిటల్‌కు ఈ నెల 24న కారులో దంపతులతో పాటు అల్లుడు మార్క్, చెల్లి మేరీ, సోదరుడు మురారీలతో కలిసి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బుధవారం సాయంత్రం 6గంటలకు బయలుదేరారు. ఆదాం కారు డ్రైవ్ చేస్తుండగా తెల్లవారురూమున 2.35 గంటలకు గన్నవరం పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి నిద్ర మత్తులో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఘటనలో డ్రైవర్ పక్క సీటులో ఉన్న మార్క్(25), వెనుక సీటులో కూర్చున్న మేరీ అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ ఆదాంకు భుజం దగ్గర, ప్రేమమ్మకు కాలికి మురారికి చేతికి గాయాలు కావటంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మార్క్‌కు భార్య, ఏడాది కొడుకు ఉన్నారు. మేరీకి భర్త ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మురారీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. గన్నవరం ప్రభుత్వాస్పత్రి వద్ద మృతుల బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుల స్వగ్రామం కోటపాడు నుంచి అధిక సంఖ్యలో బంధువులు వచ్చారు. మృతులను చూసి బోరున విలపించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ జరపాలి: దీవి చిన్మయ

ఉయ్యూరు, సెప్టెంబరు 26: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందన్న వివాదంపై సీబీఐ విచారణ జరపాలని రామసేవక్ సంఘ్ కన్వీనర్, హిందూ ధార్మిక వాహిని అధ్యక్షుడు దీవి చిన్మయ గురువారం విలేకరుల సమావేశంలో డిమాండ్‌చేశారు. దేవాలయాల్లో ప్రసాద నాణ్యత, ఆలయాల్లో దైవ కైంకర్యాలకు ఉపయోగించే సామగ్రిపైన సమగ్రవిచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవాలయాల ఆస్తులు, సత్రాలు, మఠాల అన్యాక్రాంతంపైన విచారణ జరిపి, వాటిని తిరిగి స్వాధీనం చేసుకుని ఆలయాలకు అప్పగించాలని కోరారు. దేవదాయశాఖ సిబ్బంది, అధికారులు కుల, మత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్న నిబంధనను కఠినంగా అమలు చేయాలన్నారు. జాతీయస్థాయిలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. దేవాలయాల్లో రాజకీయ ప్రమేయం, ట్రేడ్ యూనియన్లను నిషేధించాలన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సంఘ్ కన్వీనర్ పొనుగుమాటి శివ పాల్గొన్నారు.



బాపులపాడు హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న బాలికలు

ముగిసిన స్కూల్ గేమ్స్

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 26: బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఎంపిక ఆటల పోటీలు గురువారంతో ముగిశాయి. ఈనెల 24న బాలుర విభాగానికి పోటీలు నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్ అండర్- 14, అండర్ -17 బాలికల విభాగాల్లో 220 మంది విద్యార్థులు హాజరయ్యారని మండల కన్వీనర్ పామర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కొన్ని ప్రైవేట్ పాఠశాలల నుంచి 645 మంది హాజరయ్యారని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన 110 మంది శుక్ర, శనివారం గన్నవరంలో నిర్వహించే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హెచ్‌ఎం టీవీ నాగేశ్వరావు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్రరావు, పీడీలు రామచంద్రుడు, సుబ్బారావు, లక్ష్మణరావు, భాగ్యరాజు, బలరామకృష్ణ, సాయిశ్రీను, గణేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

కంకిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం షటిల్ టోర్నమెంట్‌ను స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ అజ్గర్ షరీఫ్ ప్రారంభించారు. మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులను ఎంఈవో ప్రసాద్ అభినందించారు.

బంగారు ఆభరణాల వివాదంపై కేసు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 26: తన భార్య మరణానంతరం తన బిడ్డకు చెందాల్సిన లక్షలాది రూపాయల విలువైన ఆమె బంగారు ఆభరణాలు అత్తింటి వారు తీసుకెళ్లిపోయారని చిన్న నందిగామకు చెందిన పొన్నగంటి గోపీనాథ్ చౌదరి నూజివీడు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో గురువారం హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. "పొన్నగంటి గోపీనాథ్‌చౌదరికి కొయ్యూరు గ్రామానికి చెందిన రూపకు 2021లో వివాహమైంది. ప్రసవ సమయంలో మగబిడ్డకు జన్మనిచ్చి రూప మరణించింది. ఆ సమయంలో రూప కుటుంబసభ్యులు కొల్లి లక్ష్మీపార్వతి తదితరులు ఆమె దగ్గర ఉన్న 100 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకెళ్లిపోయారు. దీనిపై పెద్దల సమక్షంలో చర్చలు ఫలించలేదు. గోపీనాథ్ నూజివీడు రెండవ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నాం." అని ఎస్సై జనార్దన్ తెలిపారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

● 100 రోజుల్లో ఇది మంచి ప్రభుత్వమని రుజువైంది: ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



చినఓగిరాలలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

విజయవాడ రూరల్, సెప్టెంబరు 26: " సీఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో ప్రజారంజక పాలన సాగించింది. ఇది మంచి ప్రభుత్వం అని రుజువు చేసుకుంది." అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. "ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ రూ.4 వేలకు పెంచి ఒకటో తేదీనే లబ్ధిదారులకు అందిస్తున్నాం. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతులకు మేలు చేశాం. దీపావళి పండుగ నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఈ ఆర్థిక సంవత్సరం లోనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తాం. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్లు మంజూరు చేస్తాం" అని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు.

హామీల అమలుతో ప్రజల మన్ననలు: ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు: "వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. తీవ్ర సంక్షోభంలో ఉన్నా ఇచ్చినమాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు చూరగొంటోంది." అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. చిన ఓగిరాలలో సర్పంచ్ యెనిగళ్ల శిరీష అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. "కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో రాష్ట్రంలో పాలన గాడిలో పెట్టింది. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. వరద బాధితులు, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేసింది. లడ్డూ ప్రసాదంలో కల్తీనెయ్యితో పవిత్రతను వైసీపీ మంట కలిపింది." అని బోడె ప్రసాద్ అన్నారు. జనసేన నాయకుడు ముప్పా రాజా, తహసీల్దార్ సురేశ్‌కుమార్, యెనిగళ్ల కుటుంబరావు, చూకూరి ప్రసాద్, రామకృష్ణ, నాగ భూషణరావు, కొండా ప్రవీణ్, యార్లగడ్డ సాయి, బాబీ పాల్గొన్నారు. ఉయ్యూరు నగర పంచాయతీలో 19, 20 వార్డులకు 10వ నంబరు సచివాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్, వైస్ ఛైర్మన్ హర్షతున్నీసా, పండ్రాజు చిరంజీవి, కరీంబేగ్ పాల్గొన్నారు.



కంకిపాడు సెంటర్‌లో పేర్ని నాని దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న కూటమి నాయకులు

పేర్ని నానీ.. నోరు అదుపులో పెట్టుకో

● లేకుంటే తీవ్ర పరిణామాలు.. కూటమి నాయకుల హెచ్చరిక

కంకిపాడు, సెప్టెంబరు 26: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వాఖ్యలు చేస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని కూటమి నాయకులు హెచ్చరించారు. పేర్ని నానీ దిష్టిబొమ్మను గురువారం కంకిపాడు సెంటర్‌లో వారు దగ్ధం చేశారు. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేయడంపై వైసీపీని ప్రశ్నించిన పవన్‌పై మాజీ మంతులు పేర్ని నాని, కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ముప్పా రాజా, పులి శ్రీనివాసరావు, బొర్రా వెంకట్, వణుకూరు విక్రం, ఏనుగ జయప్రకాష్, దొప్పలపూడి రంజిత్, బోయిన నాగరాజు, సుంకర శివ, తంబి, గంగాధర్, వీరాస్వామి పాల్గొన్నారు.



చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్



సీఎంకు చెక్కు అందిస్తున్న పోరంకి వెంకటాపురంకాలనీ వాస్తవ్యులు

వరద బాధితులకు విరాళాల వెల్లువ

పెనమలూరు: వరద బాధితులను ఆదుకునేందుకు టీడీపీ సీనియర్ నాయకుడు మారుపూడి ధనకోటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పెనమలూరు నుంచి గ్రామస్థులు ఐదున్నర లక్షల రూపాయలు, స్థానికుల నుంచి సాయిబాబా ట్రస్టు తరఫున కోయ గోపాలకృష్ణ సేకరించిన రూ.లక్షను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళంగా అందజేశారు. కానూరు వీఆర్ సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ క్లబ్ తరఫున సీఎం సహాయనిధికి రూ.ఆరు లక్షలను క్లబ్ అధ్యక్షుడు యార్లగడ్డ రూప్‌కుమార్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర దంపతులు, కేఎస్‌ఆర్కే ప్రసాద్ రూ.లక్ష అందించారు. పెనమలూరు గ్రామ నాయకులు తోటకూర ఉదయభాస్కర్, కిలారి శ్రీనివాస్, షేక్ శ్రీను బాషా, యార్లగడ్డ రూప్‌కుమార్, సుచిత్ర దంపతులు, కేఎస్‌ఆర్కే ప్రసాద్‌ను చంద్రబాబు అభినందించారు.

పోరంకి వెంకటాపురం కాలనీ తరఫున..

పెనమలూరు: వరదబాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి పోరంకి వెంకటాపురం కాలనీ నివాసితుల తరఫున వెంకటాపురం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముసునూరు సురేష్, కోశాధికారి సోమేశ్వరరావు గురువారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో రూ.2 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు.

సీఎం సహాయనిధికి రూ.2 లక్షలు అందజేత

గన్నవరం, సెప్టెంబరు 26: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి స్రవంతి హైస్కూల్ నుంచి రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు ఇబ్బందుల్లో ఉన్న వారికి సహాయ సహకారాలు అందించటం అభినందనీయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు చెక్కును అందజేస్తున్న స్రవంతి హైస్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

ఉంగరాల చోరీపై కేసు

పెనమలూరు, సెప్టెంబరు 26: తమ ఇంట్లో పనిచేసే పనిమనిషి తన రెండు ఉంగరాలను చోరీ చేసిందని పెనమలూరు వల్లభహోమ్స్‌లో నివసించే పీవై ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

స్వచ్ఛతా హీ సేవలో అందరూ భాగస్వాములవ్వాలి

● డీఈవో తాహెరా సుల్తానా పిలుపు

గన్నవరం, సెప్టెంబరు 26: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని డీఈవో తాహెరా సుల్తానా పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వేస్ట్ టు ఆర్ట్ వినూత్న ప్రదర్శనను ప్రారంభించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను సందర్శించి డీఈవో మొక్కలు నాటారు. గన్నవరం, బాపులపాడు ఉంగుటూరు మండలాల హెచ్‌ఎంలు, ఎంఈవోలతో సమావేశాన్ని నిర్వహించారు. యూడైస్ ప్లస్ అప్డేషన్ డివైస్, స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్ వ్యవస్థీకరణ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం, పాఠశాలల్లో స్వచ్ఛతపై శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. ప్రారంభం నుంచే విద్యార్థుల హాజరు, మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎంఈవోలు కొండా రవికుమార్, సురేష్, సాంబశివరావు, కమల, రాంబాలసింగ్ పాల్గొన్నారు. ఉంగుటూరు మండలంలో గృహనిర్మాణాల పురోగతిని సమీక్షించారు.

గ్రామాల స్వచ్ఛతపై దృష్టి పెట్టండి



ఈడుపుగల్లులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దేవినేని రాజా, ఇందిర

కంకిపాడు, సెప్టెంబరు 26: గ్రామాల స్వచ్ఛతపై పంచాయతీ అధికారులు, సిబ్బంది దృష్టి పెట్టాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా సూచించారు. ఈడుపుగల్లులో ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు గురువారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వర్షపు నీరు, మురుగు నీరు రోడ్డుపై నిలువ లేకుండా జాగ్రత్తలు పాటించాలని, దోమలు పెరగకుండా మందు పిచికారీ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. సర్పంచ్ పందిపాటి ఇందిర, పంచాయతీ కార్యదర్శి అహ్మద్, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ షకార్ పాల్గొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై కళాజాత ద్వారా అవగాహన కల్పించడం అభినందనీయమని ప్రొద్దుటూరు సర్పంచ్ పామర్తి నాగలక్ష్మి అన్నారు. ప్రొద్దుటూరు, మద్దూరు గ్రామాల్లో కళాజాత ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాకారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొనకళ్ల నారాయణకు అభినందన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 26: ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితుడైన కొనకళ్ల నారాయణరావుకు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో గురువారం ఆళ్ల గోపాలకృష్ణ అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమారరాజాతో కలిసి రైతు కండువా కప్పి, మొక్కను అందజేశారు. రాష్ట్ర ఉపాధిహామీ మండలి మాజీ అధ్యక్షుడు పోతుగంటి వీరయ్య, పాల్గొన్నారు.



కొనకళ్ల నారాయణకు అభినందనలు తెలియజేస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

ఆరుగొలను హైస్కూల్‌లో స్పేస్ ఆన్ వీల్స్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 26: అంతరిక్ష విజ్ఞానం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా చూపించేలా ఇస్రో సంస్థ స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తోందని ఎంఈవో సురేష్‌కుమార్ తెలిపారు. ఆరుగొలను హైస్కూల్‌లో గురువారం ఇస్రో సహకారంతో విభు సంస్థ ఏర్పాటు చేసిన స్పేస్ ఆన్ వీల్స్ బస్సులో రాకెట్ పనితీరు, అంతరిక్షంలోకి రాకెట్‌తో పాటు పంపే పేలోడ్‌లు, రోదసీలోకి మానవుడిని తీసుకెళ్లే స్పేస్ షటిల్ వాహనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం దుర్గాప్రసాద్, పద్మ, స్టాలిన్, ఉషాకుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆత్కూరు హైస్కూల్‌లో కంటి వైద్య శిబిరం

ఉంగుటూరు, సెప్టెంబరు 26: నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్(ఎన్‌పీసీబీ) కార్యక్రమంలో భాగంగా వీరవల్లి పీహెచ్‌సీ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ఎం.ఏడుకొండలు ఆధ్వర్యంలో గురువారం ఆత్కూరు జడ్పీహైస్కూల్‌లో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ పి.సాంబశివరావుతో కలిసి శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు అరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించారు. 378 మంది విద్యార్థుల్లో 232మందికి కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 15మందికి కంటి సమస్యలున్నట్లు గుర్తించి, కళ్లజోళ్లతో చూపు మెరుగుపరచవచ్చని సూచించారు. వడ్లమూడి సుబ్బారావు, ఆత్కూరు పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో సీహెచ్‌సాంబశివరాజు, హెల్త్‌సూపర్‌వైజర్ ఎ.నాగమల్లేశ్వరరావు, హెచ్‌ఎం కేవీబీకే సుధాకర్ పాల్గొన్నారు.

మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

● మండల ప్రత్యేకాధికారి, డీఈవో తాహెరా సుల్తానా



గృహ నిర్మాణాలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న డీఈవో తాహెరా సుల్తానా

ఉంగుటూరు, సెప్టెంబరు 26: పీఎంఏవైలో గత ప్రభుత్వం మంజూరు చేసిన పేదల ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా తప్పనిసరిగా పూర్తిచేయాల్సిందేనని, ఆ తర్వాత నిర్మాణాలు చేపట్టే గృహాలకు నిధులు వచ్చే అవకాశం లేదని, మండల ప్రత్యేకాధికారి, డీఈవో తాహెరా సుల్తానా స్పష్టంచేశారు. మండలంలోని పేదల లే అవుట్లలో చేపట్టిన గృహనిర్మాణాల పురోగతిపై గురువారం స్త్రీశక్తి భవనం సమావేశపు హాలులో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. లే అవుట్లలో అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలపై గ్రామాలవారీగా ఆమె సమీక్షించారు. పేదల సొంత ఇంటి కలనెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం మన ఇల్లు, మన గౌరవం పేరుతో ఈనెల 28నుంచి మండలవ్యాప్తంగా ప్రతి లేఅవుట్‌లో అవగాహనా సదస్సులు నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహనిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. తహసీల్దార్ విమలకుమారి, హౌసింగ్ ఏఈ ఎం.సురేష్, సూపరింటెండెంట్ ఎన్.బసవయ్య, ఎంఈవో-2 ఎం.సాంబశివరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మన ఇల్లు-మన గౌరవం సదస్సులు విజయవంతం చేయాలి

గన్నవరం: మన ఇల్లు-మన గౌరవం పేరుతో నిర్వహించే సదస్సులను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్కే. షాహిద్‌బాబు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవో, తహసీల్దారు, హౌసింగ్ అధికారులతో కలిసి గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 28న గృహ నిర్మాణాల లబ్ధిదారులకు మన ఇల్లు-మన గౌరవం పేరున సదస్సు నిర్వహిస్తారని, లబ్ధిదారులందరు వచ్చే మార్చిలోగా ఇల్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ప్రభుత్వం ఇస్తుందనేది వదంతులేనని తెలిపారు. ఇంటికి రూ.1.80 లక్షలు మాత్రమే వస్తాయన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో సత్యకుమార్, హౌసింగ్ ఏఈ సురేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు

ఆటోనగర్, సెప్టెంబరు 26: గ్రామానికి అవసరమైన పనులను గుర్తించడం, సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించడంలో గ్రామసభలు కీలకపాత్ర పోషిస్తాయని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి గంటా రామ్మోహన్‌రావు తెలిపారు. గురువారం పంచాయతీ కార్యాలయ సమీపంలో గ్రామసభ నిర్వహించి విజన్-2047 రూపకల్పనపై పలు అంశాలతోపాటు గ్రామ సమస్యలపై చర్చించారు. సర్పంచ్ వరి శ్రీదేవి, ఉప సర్పంచ్ పుణ్యవతి, మాజీ సర్పంచ్ కొల్లా ఆనంద్, వార్డు సభ్యులు పట్టపు చంటి, రేగళ్ల రాజా, అద్దేపల్లి సాంబశివ నాగరాజు పాల్గొన్నారు.

భూషయ్యకు బోడె ప్రసాద్ పరామర్శ

ఉయ్యూరు, సెప్టెంబరు 26: టీడీపీ నాయకుడు వల్లభనేని నాగభూషణరావు (భూషయ్య)ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం పరామర్శించారు. నాగభూషణరావు మాతృమూర్తి వల్లభనేని సత్య నాగ భానుమణి ఇటీవల మృతి చెందారు. గండిగుంటలోని ఆయన స్వగృహంలో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.



టీడీపీ నేత భూషయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కొండేటి ఏడుకొండలుకు సతీ వియోగం

ఉంగుటూరు, సెప్టెంబరు 26: పెదఅవుటపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి కొండేటి ఏడుకొండలుకు సతీ వియోగం కలిగింది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన భార్య సత్యవతి(62)బుధవారం మధ్యాహ్నం పెదఅవుటపల్లిలోని స్వగృహంలో కన్నుమూసింది. ఆమె మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సత్యవతి భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వడ్రాణం హరిబాబునాయుడు, కొనకళ్ల బుల్లియ్య బుద్దా నాగేశ్వరరావు, మున్నా రామకృష్ణ, కుందేటి చంద్రశేఖరరావు, జాస్తి వెంకటేశ్వరరావు, అరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, మేడేపల్లి రమాదేవి, మూల్పూరి సాయి కల్యాణి, గూడవల్లి నరసయ్య, కొండేటి వెంకటేశ్వరరావు, పొట్లూరి బసవారావు, వేములపల్లి శ్రీనివాసరావు, బొప్పన హరికృష్ణ, బుజ్జి తదితరులు సత్యవతికి ఘన నివాళులర్పించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

గన్నవరం, సెప్టెంబరు 26: పోషకాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అన్నారు. కేసరపల్లి బీసీ కాలనీ అంగన్వాడీ సెంటర్‌లో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని గురువారం అందజేశారు. గర్భిణులు అంగన్వాడీల్లో అందించే పౌష్టిహాకారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు

హనుమాన్‌జంక్షన్: రైల్వేస్టేషన్ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి ఆధ్వర్యంలో బాలలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్ సరిపల్లి కమాలాభాయి, అంగన్వాడీ టీచర్లు సీతాకుమారి, ధనలక్ష్మి, లక్ష్మీకుమారి, పున్నమ్మ, దుర్గ పాల్గొన్నారు.

బొమ్ములూరు, రేమల్లెలో పోషకాహార మాసోత్సవాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బొమ్ములూరు, రేమల్లె అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను చిరుధాన్యాలు, ఆకుకూరల వాడకంతో నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, ప్రీస్కూల్ చిన్నారులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, సుభాషిణి, నవీన, దేవి పాల్గొన్నారు.

కొనకళ్లకు మోదుమూడి అభినందనలు



మచిలీపట్నం టౌన్ : ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావుకు సీపీఐ నేత మోదుమూడి రామారావు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. సీపీఐ నాయకుడు నాగరాజు, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు లుక్కా సాయి రామ్ ప్రసాద్ కూడా కొనకళ్లకు అభినందనలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కుమార్‌రాజా

అభివృద్ధికి తోడ్పాటునందించండి : కుమార్ రాజా

పామర్రు, సెప్టెంబరు 26 : పామర్రు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కలెక్టర్ డీకే బాలాజీని ఎమ్మెల్యే కుమార్ రాజా కోరారు. జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన కలెక్టర్ డీకే బాలాజీని టీడీపీ నేతలతో వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ర్‌తో కుమార్‌రాజా చర్చించారు. ప్రజల సమస్యలను కలెక్టర్ బాలాజీ దృష్టికితీసుకుని వెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్. లింగమనేని రామలింగేశ్వరరావు, ప్రకాష్ పాల్గొన్నారు.



గాంధీనగరం, శారదాయిపేటలో కేక్ కట్ చేస్తున్న వేదవ్యాస్ అభిమానులు

ఘనంగా వేదవ్యాస్ జన్మదిన వేడుకలు

కృత్తివెన్ను : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ జన్మదిన వేడుకలు మండలంలో అన్ని గ్రామాల్లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. నీలిపూడి, యండపల్లి, గాంధీనగరం, చినపాండ్రాక, చినగొల్లపాలెం, మాట్లం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి, స్వీట్స్ పంచారు. చినపాండ్రాక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంచారు. పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. **గూడూరు** : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ జన్మదిన వేడుకలు శారదాయిపేటలో ఘనంగా జరిగాయి. నాయకులు కేకు కట్ చేశారు. కృత్తివెన్ను మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తిరుమాని రామాంజనేయులు, వాసుదేవ కృష్ణ భీమరాజు, ముద్దినేని కొండ, పడవల త్రినాథ్, సుంకర ఆంజనేయులు, కనపర్తి వెంకన్న, మత్తి పూర్ణ చంద్రరావు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.
ఘనంగా వేదవ్యాస్ జన్మదిన వేడుకలు

రెవెన్యూ అధికారులకు సత్కారం



గుడ్లవల్లేరు : బదిలీపై వెళ్తున్న రెవెన్యూ అధికారులను గురువారం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ఆర్ఐ షకీలాబేగం, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, మండల సర్వేయర్ పి.రామకృష్ణారావులను కార్యాలయ సిబ్బంది సత్కరించారు. డిప్యూటీ తహశీల్థారు లోకరాజు, సీనియర్ అసిస్టెంట్ శివ కుమార్, సర్వేయర్ పర్వీనా సుల్తానా, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాకుళం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



గోకవరంలో స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ



కౌతవరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో మాట్లాడుతున్న రావి

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

ఘంటసాల, సెప్టెంబరు 26 : ప్రభుత్వం మంజూరు చేసే ప్రతి పైసాను గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేసి సద్వినియోగం చేస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం గ్రామసభ గురువారం శ్రీకాకుళం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ఇచ్చిన నిధులు కూడా మళ్లించి అభివృద్ధికి అవరోధం కలిగించారన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, వరద సాయాన్ని ఆయన వివరించారు. సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేతలు తుమ్మల చౌదరిబాబు,గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పరుచూరి సుభాష్ చంద్రబోస్, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), అయినపూడి భాను ప్రకాష్, గాజుల నాగ శ్రీనివాసరావు, జనసేన నేతలు రాయపూడి వేణుగోపాలరావు, సిద్దినేని కుమార్ రాజా, కొండవీటి కృష్ణమూర్తి, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపిడిఓ డి.సుబ్బారావు, కార్యదర్శి జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్** : కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం గోకవరం, సిరివెళ్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద వద్ద జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. వంద రోజులు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, వరద సాయాన్ని ఆయన వివరించారు. కుంచే నాని, క్లస్టర్ ఇన్‌చార్జి లంకె శేషగిరి, తలారి సోమశేఖర్, సిరివెళ్ళ సాంబయ్య, సుబ్బారెడ్డి, మీనవల్లి నాగేశ్వరరావు, కొనకళ్ళ నాగరాజు, వెంకటేశ్వరరెడ్డి, సిరివెళ్ళ నాంచారయ్య, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి** : కూటమి ప్రభుత్వం 100 రోజుల్లోనే హామీలను నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందిందని నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభ గురువారం మోపిదేవి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. వరద బాధిత రైతులు, ప్రజలు, వ్యాపారులకు పది రోజుల్లోనే పరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. రాబోయే కాలంలో ఒక్కరూ మరింత గర్వించేలా పరిపాలన ఉంటుందన్నారు. ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్‌లు నందిగం మేరీ రాణి, కొక్కిలిగడ్డ మాధవి, దొప్పలపూడి గంగాభవాని, దిడ్ల జానకి రాంబాబు, పోలిమెట్ల ఏసుబాబు, అరజా సంధ్యారాణి, ఎంపిటిసిలు దిడ్ల రాణి, కొమ్ము పవన్, చందన రంగారావు, టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు తదితరులు ఉన్నారు. **పామర్రు:** ప్రకృతి విపత్తులు, భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని కష్టాల్లో ఉన్న రైతులు అండగా నిలుస్తున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంట దెబ్బతిన్న రైతులకు తక్షణం పరిహారం అందించడం ముదావహమన్నారు. **గుడ్లవల్లేరు** : ఎంతో విశ్వాసంతో ఎన్నుకున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల నీరాజనాలు అందుకుంటోందని గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. కౌతవరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, వరద బాధితులు, రైతులకు అందించిన సాయాన్ని రావి వెంకటేశ్వరరావు వివరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కొనరాజు బాపయ్య చౌదరి, తూము పద్మజ, యుగంధర్, ఈడే కృష్ణ, కొడాలి రామరాజు, తోట చిన్నారి, సాయిన పుష్పావతి, జంగం మోహనరావు, వల్లభనేని వెంకటరావు, వెనిగండ్ల రామకృష్ణ(నాని), చేకూరు జగన్మోహనరావు, దావులూరి సురేంద్రబాబు, అట్లూరి దిలీప్ కుమార్, వెంకటరత్నం, ప్రకాష్ పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలకు కృషి

మోపిదేవి దేవస్థానం ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు



బాధ్యతలు చేపడుతున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు

మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆధ్యాత్మిక వెల్లివిరిసేలా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తానని చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈవోగా బాధ్యతలు చేపట్టిన దాసరి శ్రీరామ వరప్రసాదరావు చెప్పారు. బదిలీపై వెళ్తున్న ఎన్.ఎస్. చక్రధరరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. వరప్రసాదరావు మాట్లాడుతూ, నిత్యాన్నదాన పథకానికి సంబంధించి శాశ్వత ప్రతిపదికన హాలు నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. త్వరితగతిన నిర్మాణం ప్రారంభించేలా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనల మేరకు కృషి చేస్తానని తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన మాస్టర్ ప్లాన్ ఆచరణలోకి తీసుకురానున్నట్లు ఈవో తెలిపారు.

సంతృప్తికరంగా సేవలందించా : చక్రధరరావు

రెండు సంవత్సరాల కాలంలో తాను సంతృప్తికరంగా భక్తులకు సేవలు అందించానని బదిలీపై వెళ్తున్న ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు. రూ.14.75 కోట్ల ఆదాయం ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా చేశామన్నారు. పుష్కరిణి అభివృద్ధి, అన్నదానం హాలు నిర్మాణం, స్వాగత ద్వారం, ఆలయంలో ఎస్ ఎస్ క్యూ లైన్స్ వంటి అనేక అభివృద్ధి పనులు రూ.9.75 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు.

పవన్‌కల్యాణ్ దీక్షకు సంఘీభావం



వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న కూటమి నాయకులు

కృత్తివెన్ను : తిరుపతి లడ్డూను గత వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేయటంపై పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా కూటమి నాయకులు లక్ష్మీపురం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుభ్రం చేశారు. కూటమి నాయకులు పిన్నెంటి రత్తయ్య, కొప్పర్తి భాస్కరరావు, కృష్ణ, కిరణ్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం




నాగాయలంక : యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ, నూతన కార్యవర్గ ఎన్నిక యూటీఎఫ్ భవనంలో జరిగింది. నూతన అధ్యక్షుడుటి.శ్రీనుబాబు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి కె.ఏ.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బి.కనకరావు, బి.జి.గోపాలరావు మాట్లాడారు. ఎన్నికల అధికారిగా ఎస్.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సబ్బినేని బాబూ భవాని వరప్రసాద్‌తో పాటు పీతా వీర వెంకటేశ్వరరావు, మండల నాంచారమ్మ, బండ్రెడ్డి సాంబశివరావు, మద్ది మురళి, కాట్రగడ్డ నాగేశ్వరరావు, సబ్బినేని సురేష్‌బాబులను ఎన్నుకున్నారు.

ఫిజికల్ డైరెక్టర్‌పై పోక్సో కేసు

గుడివాడ రూరల్ : మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న బాలిక పట్ల అదే పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ అసభ్యంగా ప్రవర్తించినట్లు విద్యార్థిని తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ చంటిబాబు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్‌పై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

బైక్ వేగంగా నడపొద్దన్నందుకు..

పెడన : బైక్ వేగంగా నడపొద్దని యువకుడు అనడంతో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగిన సంఘటన దక్షిణతెలుగుపాలెం (19వ వార్డు) గురువారం జరిగింది. ఇరు వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. ఒకరినొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. అనంతరం ఇరువర్గాలు పోలీసు స్టేషన్‌లో ఒకరిపై ఒకరు కౌంటర్ కేసులు పెట్టేందుకు వెళ్లారు. అయితే పోలీసులు కేసులు నమోదు చేయలేదు.





నందిగామ సర్పంచ్‌గా హరిబాబు

పెడన రూరల్ : పెడన మండలం నందిగామ గ్రామ సర్పంచ్‌గా బొడ్డు హరిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, వార్డు సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రస్తుత సర్పంచ్ బొడ్డు చినబాబు ఎన్నిక చెల్లదని హరిబాబు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వులు జారీ చేయటంతో సర్పంచ్‌గా గతంలోనే ప్రమాణస్వీకారం చేశారు. చినబాబు హైకోర్టు నుంచి స్టేకు దరఖాస్తు చేయగా దానిలో నిర్దేశిత గడువుతో స్టే పొందారు. గడువు ముగియటంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు స్థానిక పెద్దల సమక్షంలో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శి రత్నాకరరావును హరిబాబును అభినందించారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు నాగాయలంక విద్యార్థులు



నాగాయలంక : నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో కృష్ణాజిల్లా కబడ్డీ జట్టుకు కొక్కిలిగడ్డ జాహ్నవి, గుంటూరు హాసిని, పి.లీలశ్రీ, పి.చంటి, జి.జగన్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎం.ప్రసాద్ తెలిపారు. పాఠశాల పీడీ గాజుల లక్ష్మీ ప్రసాద్, కోసూరు పూర్ణ చంద్రరావు, పీఎంసీ చైర్మన్ వి.మారుతి విద్యార్థులను అభినందించారు.



బాస్కెట్‌బాల్ సెలక్షన్స్‌లో డా.కెకెఆర్స్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ : నూజివీడులో జరిగిన బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలో డా.కెకెఆర్స్ గౌతమ్ విద్యార్థులు అండర్-14 బాలికల విభాగంలో ఎ.ధృతి, స్టాండ్‌బైగా కె.వి భాషిత, అండర్-17 బాలికల విభాగంలో జి.ప్రణతి, స్టాండ్‌బైగా కె.రుత్విక ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు, కోచ్ మడకా సత్య అన్వేష్‌లను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, అభినందించారు. మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం విద్యార్థులు అండర్-14 బాలుర విభాగంలో జి.రాకేష్, అండర్-17 బాలుర విభాగంలో స్టాండ్‌బైగా షేక్ అబ్దుల్ రహమాన్ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. విద్యార్థులను పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు వి.లక్ష్మీ, కరస్పాండెంట్ పి.వి.వి రమాదుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

శ్రీదేవి శరన్నవరాత్ర ఉత్సవ రాట ప్రతిష్ఠ



గుడివాడ : విజయదుర్గ దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవ రాటా ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు రాటా ను ప్రతిష్ఠించారు. చేవూరి జగన్మోహనరావు, ముళ్ళపూడి రమేష్, గడ్డం ప్రకాష్ దాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కప్పలదొడ్డి పాఠశాల విద్యార్థి



గూడూరు : విశాఖపట్నంలో జరిగే అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన కప్పలదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్‌ను మాజీ సర్పంచ్ కట్టా మునీశ్వరరావు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలన్నారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మడుగు పోరంబోకు పేదలకు పేర్ని పరిహారం చెల్లించాలి : టీడీపీ

మచిలీపట్నం టౌన్ : మడుగు పోరంబోకులో ఇళ్లు కట్టుకునేందుకు అనుమతులిచ్చిన పేర్ని నాని పేదలకు నష్ట పరిహారం చెల్లించాలి మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మడుగుపోరంబోకలోవేసిన గుడారాలు, రేకుల షెడ్లు ముంపునకు గురయ్యాయన్నారు. ఎండి ఇలియాస్ బాషా, కాంతారావు, ఆనంద్, దేవరపల్లి అనిత, పూర్ణచంద్రరావు అచ్చన్నాయుడు, భాగ్యారావు, పాలపర్తి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 31లోగా గృహాలు నిర్మించుకోవాలి

పెదపారుపూడి : గృహనిర్మాణాలు నిర్దేశిత కాలంలోపు పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ ఈఈ ఎం.రామోజీ నాయక్ గురువారం అన్నారు. మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా ఆయన ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గతంలో మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు 2025 మార్చి 31వ తేదీలోపు నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. మండలంలోని ప్రతి లబ్ధిదారుడి తెలియపర్చాలన్నారు.







కిడ్నీ బాధితుడికి దస్తావేజులేఖర్ల సాయం

చల్లపల్లి : కిడ్నీ బాధితుడు అబ్దుల్ సుభాన్‌కు చల్లపల్లి దస్తావేజు లేఖరులు, వీఆర్వోలు సాయమందించారు. జనసేన మహిళా నేత తోట కనకదుర్గ ద్వారా విషయం తెలుసుకున్న డాక్యుమెంటరీ రైటర్లు, వీఆర్వోలు కలిసి సుభాన్‌కు రూ.16,700లను గురువారం అందజేశారు. డాక్యుమెంటరీ రైటర్లు కస్తూరి వరప్రసాద్, వడ్లమూడి రాజశేఖర్, దావులూరి మధుసూధనరావు, తోట నాగేశ్వరరావు, తోట రాజశేఖర్, ఆకుల లక్ష్మీనారాయణ, బత్తుల సాయి, సుబ్రహ్మణ్యం, తాళ్లూరి హరి, గుడిపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవపై కళాజాతా

పెదపారుపూడి : స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలలో భాగంగా వెంట్రప్రగడ, దోసపాడు, యలమర్రు గ్రామాల్లో బిళ్లపాడు కళాకారులు కళాజాతా నిర్వహించారు. కళాకారుల బృందం సభ్యులు ఎడ్లవల్లి వీరయ్య, తేజ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత, మొక్కలునాటడం, ఎలక్ట్రానిక్ వేస్ట్, ప్లాస్టిక్ వాడకం నిషేధం తదితర అంశాలపై కళారూపంలో ప్రజలకు వివరించినట్లు ఆయన తెలిపారు.

మొవ్వ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది బదిలీ

కూచిపూడి : మొవ్వ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధిక శాతం సిబ్బంది బదిలీ అయ్యారు. ఈ విషయాన్ని తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సిహెచ్.గోపాలరావు పామర్రు మండలానికి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీనివాసరావు కొడాలి పీడీఎస్ డీటీగా బదిలీ అయ్యారు. ఆర్ఐ ఈడే విజయలక్ష్మి సీనియర్ అసిస్టెంట్‌గా పెడన తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్ శామ్యూల్ కోడూరు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వీఆర్వోలు సైతం పలువురు మండలంలో అంతర్గత బదిలీలు పొందగా, మరి కొంతమంది జిల్లాలోని పలు ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

పెడన మున్సిపాల్టీలో బదిలీలు

పెడన : పెడన మునిసిపాలిటీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ వి. ఏసుబాబు గుడివాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ముడాలోని సుజనకుమారి నియమితులయ్యారు. సీనియర్ అసిస్టెంట్ కె.డి.ఎస్. సుందరం తాడిగడప బదిలీ కాగా, ఆయన స్థానంలో నందిగామ నుంచి ఎస్‌వి కృష్ణయ్యను నియమించారు. సీనియర్ అసిస్టెంట్ చినవెంకటేశ్వరరావు నందిగామ బదిలీ అయ్యారు. సీనియర్ ఎకౌంటెంట్ గా తాడిగడప నుంచి ఆదిలున్నీసా రానున్నారు. సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తాడిగడప బదిలీ కాగా. ఆయన స్థానంలో నూజివీడు నుంచి రాధికను నియమించారు. సీనియర్ అసిస్టెంట్ పెద్దిరాజును నూజివీడు బదిలీ చేసి ఆయన స్థానంలో అక్కడ పనిచేస్తున్న సుబ్రహ్మణ్యాన్ని నియమించారు. బిల్ కలెక్టర్ కె. రమ్యను గుడివాడకు బదిలీ చేసి ఆమె స్థానంలో గుడివాడలోని ఎం.వెంకటేశ్వరరావును నియమించారు.

